ప్రజారోగ్యమే లక్ష్యం

- చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- పోటెత్తుతున్న జనాలు.. సేవల్లో వైద్యులు



రమణయ్యపేట గైగోలుపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు తీసుకుంటున్న గ్రామస్తులు

కాకినాడ రూరల్: కుటుంబ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఏ సుస్తీ చేసినా ఏదో చిన్న మాత్ర మింగి కాస్త తేరుకున్నాక మళ్లీ పొట్టచేత పట్టుకుని పనికి పోయేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. సురక్ష శిబిరాల ద్వారా మెరుగైన వైద్యాన్ని పొందుతూ పూర్తి ఆరోగ్యవంతులుగా, అవసరమైనతే మెరుగైన వైద్యానికి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులలో చికిత్స చేయించి పంపుతున్నారు. సెప్టెంబరు నెలలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో సెప్టెంబరు 30న పి.వెంకటాపురంలో కలెక్టరు కృతికా శుక్లా, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత జిల్లా స్థాయిలో తొలిసారిగా ప్రారంభించారు. నియోజకవర్గంలో 58 సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. రూరల్ మండలంలో 1,65,000 జనాభా ఉండగా 62,123 ఇళ్ళు ఉన్నాయి. 41 గ్రామ సచివాలయాలకు పండూరు, తూరంగి గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉండడంతో ఆ గ్రామాలు మినహా మిగిలిన 39 సచివాలయాల్లో శిబిరాల నిర్వహణకు షెడ్యూల్ రూపొందించారు. రెండు పీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాల ఏర్పాటు, షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో ముందుగా సర్వే, కూపన్ల జారీ తదితర వాటిని ఎంపీడీఓ స్వప్న, తహసీల్దార్ మురార్జీ పర్యవేక్షిస్తున్నారు. మండలంలో వాకలపూడి సచివాలయం – 4 పరిధిలో ఈనెల 20న జరగనున్న వైద్య శిబిరంతో కార్యక్రమం ముగియనుంది. ఇప్పటికే 24 సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య శిబిరాలు పూర్తయ్యాయి. 91,663 మందిని సర్వే చేయగా 8,850 మంది వైద్య సేవలు పొందారు. మరో 15 సచివాలయాల పరిధిలో ఈ నెల 20 లోగా శిబిరాలు నిర్వహించనున్నాను.



సూర్యారావుపేట శిబిరంలో వైద్య సేవలందిస్తున్న పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆయేషా ఫాతిమా



జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్న వ్యక్తులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పగడాలపేటలో సురక్ష శిబిరం

కాకినాడ సిటీ: తూరంగి 4వ సచివాలయ పరిధి పగడాలపేట హైస్కూల్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ హాజరై ఈ వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో తూరంగి పీహెచ్‌సీ వైద్యులు ప్రశాంతి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనూహ్య స్పందన

సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమయ్యే వైద్యాన్ని సురక్ష శిబిరం ద్వారా అందిస్తున్నాం. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. ఎక్కువ మంది బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. చిన్న పిల్లలు, స్త్రీ వ్యాదులు, జనరల్ మెడిసిన్ తదితర వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొని వైద్యం చేస్తున్నారు. నెలకు సరిపడే మందులు ఉచితంగా అందిస్తున్నాం.

– ఆయేషా ఫాతిమా, వైద్యాధికారి, పండూరు పీహెచ్‌సీ, కాకినాడ రూరల్

ముందుగా విస్తృత ప్రచారం



జగనన్న ఆరోగ్య సురక్ష కోసం ముందుగానే విస్తృత ప్రచారం చేశాం. వైద్య శిబిరం ఏర్పాటు చేయవల్సిన సచివాలయం పరిధిలో 21 రోజులు ముందుగా యాప్ ఓపెన్ అవుతుంది. 15 రోజుల ముందు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు, ఆరోగ్య సర్వే చేపట్టి, కూపన్లు అందించడంతో పాటు వైద్య శిబిరానికి హాజరవ్వాలని వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది కోరుతున్నారు. కాకినాడ రూరల్ రెండు పీహెచ్‌సీల ద్వారా శిబిరాలను షెడ్యూల్ ప్రకారం రోజుకు ఒకటి ఉండేలా 52 రోజుల పాటు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం.

– కర్రే స్వప్న, ఎంపీడీఓ, కాకినాడ రూరల్

క్లుప్తంగా

దత్తాత్రేయ, సాయినాథుని విగ్రహ పునఃప్రతిష్ఠ



పునఃప్రతిష్ఠకు ముందు పూజలు అందుకుంటున్న దేవతామూర్తుల విగ్రహాలు

కరప: మండలం గురజనాపల్లిలో ఆధునీకరించిన శిరిడిసాయి మందిరంలో గురువారం కోదండరామ, మహాగణపతి, సరస్వతి, దత్తాత్రేయ, శిరిడీసాయి విగ్రహాల పున:ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభించారు. కాజులూరు మండలం దుగ్గదుర్రు వాస్తవ్యులు పూజ్యం నాగేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పుల్లేటికుర్తి అచ్యుతరామ శాస్త్రి శైవాగమ పద్ధతిలో త్రయాహ్నిక దీక్షతో ప్రతిష్ఠ నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు, కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, సత్యనారాయణమ్మ తదితరులతో పూజా కార్యక్రమాలు చేయించారు.

వచ్చేనెల ఐదున ఫ్యామిలీ క్రిస్మస్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దేవిడ్‌రాజు

కరప: ఈ ఏడాది మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు కరపలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు తెలిపారు. యండమూరులో గురువారం రెవరెండ్ ఐ.జాన్ సూర్యప్రకాష్ గృహంలో ఏర్పాటు చేసిన ఫెలోషిప్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ ఐదున ఫ్యామిలీ క్రిస్మస్ నిర్వహిస్తామని, మండలంలోని పాస్టర్లు కుటుంబసభ్యులతో వచ్చి విజయవంతం చేయాలని డేవిడ్‌రాజు కోరారు. ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జె.పాల్‌ప్రసాద్, కార్యదర్శి ఆర్.ప్రతాప్‌కుమార్, ట్రెజరర్ కె.ఆనందబాబు, డాక్టర్ స్టీఫెన్‌బాబు, కన్వీనర్ పి.సత్యప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ వద్ద ఐదు గుళ్ల ప్రాంగణంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. వినాయక చవితి, దేవీ నవరాత్రులు ఘనంగా ముగియడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు. రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల తదితర గ్రామాలతో పాటు నగరానికి చెందిన సుమారు 3 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల రాజబాబు, ఇంటి నందిబాబు, వేణు, మాణిక్యాలరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అడబాల వెంకటేశ్వరరావు,. తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై వినతి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని కలసిన శాస్త్రి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి బుధవారం అమరావతిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డిని కలసి పెన్షనర్ల సమస్యలపై చర్చించినట్టు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం గురువారం తెలిపారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కూడా కలసినట్టు పేర్కొన్నారు. సంఘం తరపున ఇచ్చిన విజ్ఞాపనపై జవహర్ రెడ్డి స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారన్నారు.

కోటి బిల్వార్చనకు చురుగ్గా ఏర్పాట్లు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరులో శివారు ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ఎదురుగా 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆకుల వీర్రాజు స్థలంలో ఈ నెల 4న నిర్వహించే కోటి బిల్వార్చన, పడిపూజలకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో తొలిసారిగా నిర్వహిస్తున్న కోటి బిల్వార్చనలో 15 వేల మంది అయ్యప్ప మాలధారణ భక్తులు, మరో పది వేల మంది సాధారణ భక్తులు పాల్గొనేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కోటి బిల్వార్చనకు కేరళ శబరిమలై సన్నిధానం నుంచి పందల రాజుల వంశస్తులు, అయ్యప్పస్వామి ఆలయం ప్రధాన అర్చకులు మేల్ శాంతి, తిరు ఆభరణాలు తీసుకువెళ్లే స్వామి, చండా వాయిద్య కళాకారుల బృందం హాజరుకానుంది. మాలధారణ భక్తులకు మౌలిక వసతులు, ఫలహారం వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. సదుపాయాల కల్పనలో స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోనున్నారు. బిల్వాలు, కొబ్బరి కాయకులు, పూలు, ఇతరేతర సేవలు అందిస్తున్నారు.

ఉప్పాడ చేనేత సంఘానికి పురస్కారం అభినందనీయం

కలెక్టర్ కృతికా శుక్లా



డాక్టర్ వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును కలెక్టర్‌కు అందజేస్తున్న జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారులు

కాకినాడ సిటీ: 2023 సంవత్సరానికి ఉప్పాడ చేనేత సహకార సంఘానికి డాక్టర్ వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కడం అభినందనీయమని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లాకు గౌరవ సూచకంగా జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి, ఇతర సిబ్బంది ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉప్పాడ చేనేత సహకార సంఘం సభ్యులను, జిల్లా చేనేత, జౌళి అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1938లో ప్రారంభమైన సంఘం 85 ఏళ్లుగా చేనేత కార్మికులకు ఉపాధిని కల్పిస్తోందన్నారు. ఉప్పాడ జాన్దానీ చీరలకు 2008లో జీఐ ట్యాగ్ గుర్తింపు పొందిందన్నారు. అవార్డు నగదును ఉప్పాడ చేనేత సహకార సంఘం అభివృద్ధికి, సభ్యులకు పని కల్పించడానికి వినియోగించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా చేనేత, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.పెద్దిరాజు, చేనేత అభివృద్ధి అధికారులు ఏయూ రవికుమార్, భాస్కర్, ఏడీవోలు, వీవర్ దాసం బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు త్వరలో ఏఆర్వీ



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: పురపరిపాలన శాఖ ఆదేశాల మేరకు పారిశుధ్య కార్మికులకు, శునకాలకు ఏఆర్‌వీ ఇంజక్షన్లు వేసేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, సంబంధిత వర్గాలతో సమీక్షించారు. శునకాలకు ఏఆర్వీలను వేసేందుకు నలుగురు సభ్యులతో కూడిన ఎనిమిది బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నగర పరిధిలో ఉన్న 10 వేలకు పైగా శునకాలకు ఏఆర్వీ వేయనున్నట్టు తెలిపారు. అలాగే సుమారు 1200 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, వీరందరికీ కార్పొరేషన్ పరిధిలోని 13 పీహెచ్‌సీలలో వేక్సిన్లు వేయిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను వచ్చే సోమవారం నాటికి సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శునకాల మోనిటరింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ సుశీ, కో-ఆర్డినేటర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడ్డాల జానకి రమ, ప్రసూన

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం అడ్డాల జానకి రమ, లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పనకు వీలుగా తమ వంతు సహకారం అందించేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. కుట్టు మిషన్లను సమకూర్చిన టీసీ దేవకీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథి అడ్డాల జానకి రమ మాట్లాడుతూ స్త్రీలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడినప్పుడే మహిళా సాధికార లభిస్తుందన్నారు. ఎం. ప్రసూన మాట్లాడుతూ కుట్టు శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, పార్థసారధి, శ్రీనగేష్, రామారావు, అడబాల సత్యనారాయణ, శ్రీవాణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సమస్యలపై నేటి నుంచి జాతీయ సమావేశాలు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మత్స్యకారుల వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక, సమైక్య జాతీయ ప్రధాన కార్యదర్శి పి.స్టాన్లీ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల సమస్యలపై పోరాడుతున్న ప్రతినిధులతో అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక, సమైక్య జాతీయ సమావేశాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కాకినాడలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బ్లూ ఎకానమీ ఆఫ్ షోర్ ఏరియాస్ మినరల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ పేరుతో సముద్రంలో ఉన్న 138 లోహాలను వెలికి తీయడానికి పార్లమెంట్‌లో చట్టం చేసి 100 కిలోమీటర్ల చొప్పున ముక్కలు చేసి ప్రైవేట్ బ్యాంకుల ద్వారా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని దీన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు స్టాన్లీ అన్నారు. సమావేశాల్లో దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి మత్స్యకార సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. మత్స్యకార్మికసంఘం రాష్ట్ర నాయకులు కర్రి చంద్రశేఖర్, కొల్లాటి శ్రీనివాసరావు, చెక్కా రమణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు పళ్లంరాజు పరామర్శ



వీరయ్యచౌదరిని పలకరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

కరప: మండలం వేళంగి గ్రామానికి సీడబ్ల్యూసీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు గురువారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, పీసీసీ మాజీ సభ్యుడు మెర్ల వీరయ్యచౌదరిని కలసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చౌదరి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో వచ్చి పలకరించినట్టు పళ్లంరాజు తెలిపారు. ఒక ప్రశ్నకు ఆయన బదులిస్తూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందని, వచ్చే ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. పార్టీ నాయకుడు మట్టా ప్రసాద్, మెర్ల పెద అగస్తయ్య, చిన అగస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో నేలకొరిగిన భారీ వృక్షం



చెట్టు కొమ్మలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో ఓ భారీ వృక్షం నేలకొరిగింది. ఐదాకుల చెట్టుగా పిలిచే ఈ వృక్షం మెడికల్ భవంతి నుంచి సర్జికల్‌కి వెళ్లే మార్గంలో ఎడమ వైపు ఉంటుంది. త్వరగా ఎత్తు పెరగడం ఈ చెట్టు లక్షణం. ఎత్తు ఎదగడంతో పాటు వేళ్లు డ్రైనేజీ లోపలికి వెళ్లడం వల్ల బలహీనపడి గురువారం వీచిన గాలులకు చెట్టు నేలకొరిగింది. ఓ కారుపై పడడంతో వాహనం పాక్షికంగా దెబ్బతింది. సాలిపేట ఫైర్ ఆఫీసర్ ఉద్దండ రావు సుబ్బారావు ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల రెస్క్యూ బృందం గంటకు పైగా శ్రమించి చెట్టును కత్తిరించి తొలగించారు. అప్పటి వరకు ఓపీ కోసం వెళ్తున్న రోగులు ఇబ్బంది పడ్డారు.

దుగ్గన హయాంలో రూ.2 కోట్లు స్వాహా

- త్వరలోనే చట్టపరమైన చర్యలు
- ద్వారంపూడిని విమర్శించే స్థాయి లేదు
- లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు



సమావేశంలో మాట్లాడుతున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు

కాకినాడ: కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన దుగ్గన నాగరాజు (బాబ్జి) తన హయాంలో రూ.2 కోట్లుకు పైగా కార్మికుల కష్టాన్ని దోచుకున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు ఆరోపించారు. స్థానిక సంజయ్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు తాను నిజాయితీపరుడిగా ప్రకటించుకుంటూ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని దుగ్గనపై మండిపడ్డారు. అసోసియేషన్ వద్ద ఉన్న సమాచారం ప్రకారం అతని రెండేళ్ల హయాంలో రూ.5 కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని, అయితే రూ.2. 47 లక్షలకు మాత్రమే లెక్కలు చూపించారన్నారు. రూ.4.47 కోట్లకు ఆదాయం, ఖర్చు చూపిస్తూ ఆడిట్ నివేదికలో ఇచ్చిన సమాచారం చూస్తే ఏ స్థాయిలో అవినీతి చేసారో స్పష్టమవుతోందన్నారు. అగ్గిపెట్టెలాంటి చిన్న కేంటిన్ పెట్టి రూ.14 లక్షలు ఖర్చు చూపించారని, మంచినీరు, టీ, కాఫీలు, ఫుడ్ ఖర్చుల కింద రూ.16.5 లక్షలు ఖర్చు చేశారని చెప్పారు. చివరికి దేవుడిని కూడా వదలకుండా వారానికి ఒక సారి చేసే పూజా ఖర్చుల కింద రెండేళ్లకు రూ.6.15 లక్షలు ఖర్చు చేసినట్టు ఆడిట్‌లో చూపించారన్నారు. వీటిపై సరైన సమాధానం చెప్పకపోతే పోలీసు కేసు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే లారీ యార్డుకు వచ్చి బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. ఎమ్మెల్యే పేరు చెప్పి అసోసియేషన్‌లో అతను చేసిన దందాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయన్నారు. తన రెండేళ్ల హయాంలో 20 నెలలు కరోనా ఉందని, అసలు ఆదాయమే లేదంటూ దుగ్గన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి ఇప్పటి కన్నా అప్పుడే రేవులో అత్యధిక కార్యకలాపాలు జరిగాయని చెప్పారు. ప్రస్తుతం బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధం ఉన్నందున ఇప్పుడు గణనీయంగా లారీ పరిశ్రమపై ప్రభావం చూపిస్తోందన్నారు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే ద్వారంపూడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఆరు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన లారీ యూనియన్ ప్రతిష్ట మంటగలిపేలా దుగ్గన తప్పుడు ప్రచారాలు, దుర్మార్గాలను తగిన రీతిలో అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు లారీ యజమానులు పాల్గొన్నారు.

11న నాదజ్యోతి ముత్తుస్వామి వర్ధంతి

బోట్‌క్లబ్: స్థానిక సూర్యకళామందిరంలో ఈ నెల 11న సాయంత్రం ఐదు గంటలకు సంగీత ప్రవంతి ఆధ్వర్యంలో నాదజ్యోతి ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి నిర్వహిస్తున్నట్టు నిర్వాహకురాలు పెద్దాడ సూర్యకుమారి గురువారం విలేకరులకు తెలిపారు. పుష్పా రామ్మోహన్ శిష్య బృందం ముత్తుస్వామి దీక్షితార్ కృతులను గానం చేస్తారన్నారు. స్థానిక విద్వాంసుల గాత్ర కచేరీ ఉంటుందన్నారు. సంగీత అభిమానులు పాల్గొనాలని ఆమె కోరారు.

తూరంగి అభివృద్ధి అభినందనీయం

కాకినాడ సిటీ: తూరంగి గ్రామం ప్రధాన రహదారి అభివృద్ధిపై నగర వెండి, బంగారు వర్తక సంఘం అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దాట్ల సత్యనారాయణ, పులగల శ్రీనుబాబు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు చినుకు పడితే మునిగిపోయే లోతట్టు నేడు గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశాలతో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు వేసి అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో గురువారం వారు తూరంగిలో విలేకర్లతో మాట్లాడారు. రూరల్ నియోజకవర్గాన్ని తనదైన శైలిలో అభివృద్ధి చేస్తూ ముందుకు వెళ్తున్న ఎమ్మెల్యే కన్నబాబు ప్రశంసిస్తూ మళ్లీ మీరే రావాలంటూ ఆయనకు జేజేలు పలుకుతున్నారన్నారు. తూరంగిలో ఎన్నో ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఎమ్మెల్యే కన్నబాబు మోక్షం కలిగించారన్నారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీటి వసతి కల్పిస్తూ తూరంగిని అభివృద్ధి చేస్తూ సుందరీకరణ పనులు చేస్తున్నారన్నారు. అలాగే తూరంగిలో ప్రాధాన్యం ప్రకారం పనులను చేయిస్తున్న మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా శక్తి సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సీసీ రామకృష్ణ

కరప: మహిళాశక్తి సంఘాలు పొదుపు పాటిస్తూ, తీసుకునే బ్యాంక్ రుణాలను సద్వినియోగంచేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ సీసీ, గ్రామ ఇన్‌చార్జి రామకృష్ణ సూచించారు. పెనుగుదురులో గురువారం జరిగిన గ్రామైఖ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకోవడంలో కానీ, మహిళాశక్తి సంఘాల రికార్డుల నిర్వహణలో కానీ ఎవరికీ ఎటువంటి కమీషన్లు ఇవ్వొద్దన్నారు. గ్రామంలోని మహిళాశక్తి సంఘాల నుంచి గ్రామైక్య సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి, సంఘసభ్యుల సభ్యత్వం రెవెన్యూవల్, చేయాల్సిన పొదుపుపైన, కరపలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ నుంచి పెనుగుదురులోని ఎస్‌బీఐకి అకౌంట్లు మార్చడానికి తీర్మానాలు చేశారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మేడిశెట్టి లక్ష్మి, డీఆర్‌డీఏ సీసీలు టి.మురళీకృష్ణ, ఎస్.సత్యనారాయణ, రెడ్డిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ వంగా గీత
- అభివృద్ధి పనులకు శ్రీకారం
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి



మహిళా డిగ్రీ కళాశాలలో పింక్ టాయిలెట్లను ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తున్నారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. గురువారం ఆమె ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో కలసి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు హాజరయ్యారు. తొలుత రూ.1.3 కోట్లతో సాలిపేట బాలికోన్నత పాఠశాలలో నిర్మించిన పది అదనపు తరగతి గదులను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతి దేవి మహిళా డిగ్రీ కళాశాలలో రూ.50 లక్షల ఎంపీ నిధులు, రూ.30 లక్షల కార్పొరేషన్ నిధులతో నిర్మించిన పింక్ టాయిలెట్, అదనపు తరగతి గదులను ప్రారంభించారు. 23వ డివిజన్‌లో రూ.2 కోట్లతో ప్రతిపాదించిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ఎన్టీఆర్ వారధి నుంచి పెనుగుదురు వంతెన వరకు రూ.3 కోట్ల సీఎం విడుదల చేసిన నిధులతో నిర్మించనున్న ఆర్అండ్‌బి రహదారి మరమ్మతులను కూడా ప్రారంభించారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ప్రభుత్వ, స్మార్ట్ సిటీ, కార్పొరేషన్ నిధులను వినియోగించి ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని కూడా ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి సీఎం జగన్ తీసుకువచ్చిన పాలనా సంస్కరణల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఇందుకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో నాడు-నేడు పథకం ద్వారా అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. గడప గడపకూ ప్రభుత్వంలో 23, 24, 25 డివిజన్ల ప్రజలు వివరించిన తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా రూ.రెండు కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నామన్నారు. మూడు నెలల్లో ఈ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబర్ చివరికి నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పన పూర్తి చేస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ ఆయా అభివృద్ధి పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఇనుకొండ పట్టాభిరామయ్య, రాగిరెడ్డి బన్నీ, నల్లబిల్లి సుజాత, మీసాల దుర్గాప్రసాద్, మీసాల శ్రీదేవి, ఎంజీకే కిశోర్, సంగాని నందం, వెలమల మల్లేశ్వరరావు, రోకళ్ల సత్యనారాయణ, చెవ్వాకుల రాంబాబు, కార్పొరేషన్ ఎస్ఈ సత్యకుమారి, ఈఈ వెంకట్రావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉండూరులో సామూహిక కుంకుమ పూజలు



ఉండూరులో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: మండల పరిధిలో ఉండూరు రామాలయంలో స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో గురువారం నుంచి ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పారాయణ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకన్న, వేమూరి చంటి, సత్యనారాయణమూర్తి, అల్లకి రాజాల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గ్రామంలోని అనేక మంది మహిళలు పాల్గొన్నారు. శుక్రవారం గొంచాలలోను, 4న కాపవరంలోను, 5న వేట్లపాలెంలోను, ఆరున హుస్సేన్‌పురంలోను ఏడున వీకె రాయపురం గ్రామంలోను, 8న నవర గ్రామంలోను ధర్మ ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ వివరించారు. ఈ మేరకు పారాయణలు, కుంకుమ పూజలు, భజనలు, కోలాటం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.